చెక్కును అందజేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

విద్యార్థిని కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేత

- బాధిత కుటుంబానికి సిఎం చంద్రబాబు పరామర్శ

ప్రజాశక్తి-బద్వేలు (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ జిల్లా బద్వేలులో పెట్రోల్ దాడికి గురై మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. బుధవారంనాడు విద్యార్థిని తల్లితో సిఎం చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. నిందితుడిని అరెస్టు చేశారని, కఠిన శిక్ష పడేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరుపుతామని చెప్పారు. బాలిక సోదరుడికి చదువు బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థిని తల్లికి ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేయాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అనంతరం ఇన్‌ఛార్జ్ కలెక్టర్ అధితి సింగ్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి పరిహారం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ చంద్రమోహన్, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఇద్దరు విద్యార్థుల మృతి

ప్రజాశక్తి-పీలేరు (అన్నమయ్య జిల్లా)

రైలు ఢీకొని ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందారు. ఈ సంఘటన అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికుల కథనం మేరకు.. పీలేరు పట్టణంలోని ఎస్‌కెడి నగర్‌కు చెందిన కె.కిరణ్ (19), పద్మావతి నగర్‌కు చెందిన ఎస్.యాసిన్ (18) అనే విద్యార్థులు మంగళవారం అర్ధరాత్రి స్థానిక రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో రైల్వే ట్రాక్ వద్దకెళ్లి కూర్చున్నారు. అదే సమయంలో నాగర్ కోయిల్ నుంచి ముంబయి వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన లోకో పైలట్ రైలును ఆపి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థులు ఇరువురూ స్థానికంగా ఓ ప్రయివేట్ కళాశాలల్లో ఒకరు డిగ్రీ ద్వితీయ సంవత్సరం, మరొకరు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిరణ్ (ఫైల్)

ఎస్.యాసిన్ (ఫైల్)

శ్రీవారిని దర్శించుకుని వస్తున్న సీతక్క

తిరుమల శ్రీవారి సన్నిధిలో తెలంగాణ మంత్రి సీతక్క

ప్రజాశక్తి- తిరుమల

తెలంగాణ మంత్రి సీతక్క కుటుంబ సమేతంగా బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయక మండలంలో శ్రీవారి తీర్థప్రసాదాలతోపాటు టిటిడి కేలండర్ అందజేశారు. ఆలయం వెలుపల మీడియాతో సీతక్క మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మొదటిసారి తాను తిరుమలకు వచ్చినట్లు తెలిపారు. పని ఒత్తిడి వల్ల మొక్కులు చెల్లించుకోవడం ఆలస్యమైందని, శ్రీవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, వయనాడ్‌లో ప్రియాంక గాంధీ ఘన విజయం సాధించాలని కోరుకున్నట్లు తెలిపారు.

ఏనుగు దాడిలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -రామకుప్పం (చిత్తూరు జిల్లా)

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా రామకుప్పం మండలంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిఎంకె తాండాకు చెందిన చెందిన రెడ్డు నాయక్ (47) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవించేవారు. రెండు నెలల క్రితం ఆయన భార్య ప్రమీల ఆనారోగ్యంతో మరణించారు. అప్పటి నుంచి తరచూ రెడ్డు నాయక్ అటవీ సరిహద్దులోని స్మశానంలో భార్య సమాధి వద్దకు వెళ్లివచ్చేవారు. ఈ నేపథ్యంలో మంగళవారం కూడా వెళ్లి వస్తుండగా ఏనుగు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందారు. రెడ్డు నాయక్‌కు ఓ కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జిల్లా అటవీ అధికారి భరణి, డాక్టర్ సురేష్ పరామర్శించారు. రెడ్డు నాయక్ కుమారుడు సైరాజ్‌కు రూ.10 లక్షల పరిహారం అందజేశారు. ఘటనా స్థలాన్ని కుప్పం రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎఫ్ఆర్‌ఒ జయశంకర్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్డు నాయక్ (ఫైల్)

నష్టాల బాటలో 'ఇటుక పరిశ్రమ'

- ఇసుక కొరతతో నిలిచిన నిర్మాణాలు • పడిపోతున్న అమ్మకాలు • పనుల్లేక కార్మికులు విలవిల

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

గత ప్రభుత్వంలో మాదిరిగానే టిడిపి కూటమి సర్కారులోనూ ఇసుక కష్టాలు తప్పడం లేదు. నెలల తరబడి ఇసుక సక్రమంగా అందుబాటులో లేక నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో, అమ్మకాలు పూర్తిగా పడిపోయి ఇటుక నిల్వలు పేరుకుపోయాయి. ఇటుక పరిశ్రమ నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతోంది. పనుల్లేక కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మండపేట, అనపర్తి, రాయవరం, బిక్కవోలు, ఆలమూరు, రామచంద్రపురం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, కడియం మండలాల్లో ఎక్కువగా ఇటుక బట్టీలు ఉన్నాయి. మెట్ట ప్రాంతమైన పిఠాపురం, పెద్దాపురంలోని కొన్ని మండలాల్లోనూ ఇటుకలను తయారు చేస్తున్నారు. సుమారు 14 వందల ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 750 వరకూ ఇటుక బట్టీలు ఉన్నాయి. బట్టీ స్థాయిని బట్టి ఒక్కో దానిలో రోజుకు సీజన్లో 10 వేల నుంచి 40 వేల ఇటుకలను తయారు చేస్తుంటారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, విశాఖపట్నం, శ్రీకాకుళం, గుంటూరు, విజయనగరం జిల్లాల నుంచే కాకుండా పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల వలస కూలీలు ఈ బట్టీల్లో పని చేస్తున్నారు.

నిల్వ ఉన్న ఇటుక బట్టీలు

అస్తవ్యస్తం

ఇసుక కొరత లేని సమయాల్లో రోజుకి 20 వేల నుంచి 40 వేల ఇటుక అమ్మకం జరిగేవి. ఒక్కోసారి లక్ష ఇటుకలను అమ్మిన సందర్భం కూడా ఉన్నాయి. ఇసుక అందుబాటులో లేకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయి ఇటుక వినియోగం పూర్తిగా తగ్గిపోయింది. నాలుగు నెలలుగా పది వేల ఇటుకను కూడా అమ్మలేకపోయామని పిఠాపురం మండలం విరవాడ, విరవ గ్రామాలకు చెందిన బట్టీ యజమానులు పంతం శ్రీను, కందా రాజు, కందా శివ, మంజునాథ వాపోయారు. నిర్మాణాలు సక్రమంగా జరిగే సమయంలో వెయ్యి ఇటుక రూ.7 వేలు ఉండగా ప్రస్తుతం రూ.5 వేలు మాత్రమే పలుకుతోందని తెలిపారు. కొనేవారు లేక ఇటుక నిల్వలు పేరుకుపోయాయని చెప్పారు. ఒక్కో బట్టీలో మూడు లక్షల వరకూ ఇటుక నిల్వ ఉండిపోయిందని, వీటి తయారీకి రూ.16 లక్షల వరకూ పెట్టుబడి అయిందని చెప్తున్నారు. వెయ్యి ఇటుక తయారీకి రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకూ ఖర్చవుతోంది. అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని, ధర పడిపోవడంతో నష్టాలు వస్తున్నాయని, వడ్డీ కూడా కట్టలేకపోతున్నామని ఇటుక బట్టీల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తయారైన ఇటుక కొనేవారు కూడా లేక ఈ పరిస్థితి తలెత్తిందని విరవాడ గ్రామానికి చెందిన బట్టి నిర్వాహకులు బోయి నాగేశ్వరరావు తెలిపారు. గతేడాది వెయ్యి ఇటుక బట్టీ వద్ద రూ.6 వేల నుండి నుంచి రూ.7 వేల వరకూ అమ్మగా, ప్రస్తుతం రూ.4 వేల నుంచి రూ.5 వేలు వరకూ మాత్రమే అమ్ముడవుతోందని ఆయన చెప్పారు.

ఉపాధికి దూరమైన కార్మికులు

ఇసుక బట్టీలపై పది వేల మందికిపైగా కార్మికులు ఆధారపడ్డారు.

ఒక్కో బట్టీలో 30 మంది వరకూ కార్మికులు ఉన్నారు. బట్టీల వద్దే తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. 25 ఏళ్ల నుంచి ఇక్కడే పనిచేస్తున్న కుటుంబాలు వందల సంఖ్యలో ఉన్నాయి. కొత్త ఇటుక తయారీ లేకపోవడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారు. యజమానులు అడ్వాన్సుగా ఇచ్చిన డబ్బులు కుటుంబ పోషణకు ఖర్చయిపోయాయని, తమ కుటుంబాలు పస్తులుండే పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

నాలుగు నెలలుగా ఇటుక బట్టి పని ఉండడం లేదు. ఉపాధి కోసం సుదూర ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చాము. ఇటుక బట్టీలు మూతపడే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం వెంటనే స్పందించి వలస కార్మికులను ఆదుకోవాలి.

– రుణ, బట్టీ కార్మికురాలు (పశ్చిమ బెంగాల్)

ఎలా బతికేది?

ఇసుక కొరత వల్ల ఇటుకను ఎవరూ కొనడం లేదని యజమానులు చెబుతున్నారు. నాలుగు నెలలుగా కొత్త ఇటుక తీయలేదు. మాకు ఉపాధి లేకుండాపోయింది. కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఎలా బతకాలో అర్థం కావడం లేదు.

– స్వరూప్ (పశ్చిమబెంగాల్ నుంచి వచ్చారు), బట్టీ కార్మికుడు, విరవాడ, పిఠాపురం మండలం

మూడేళ్లలో డిజిటల్ చెల్లింపులు రెట్టింపు : ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : కరోనా తర్వాత భారత్‌లో డిజిటల్ చెల్లింపులు అత్యంత వేగంగా పెరిగిపోయాయి. గడిచిన మూడేళ్లలోనే రెట్టింపు అయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. అయినప్పటికీ.. ఇప్పటికీ నగదు చెల్లింపుల లావాదేవీలు 60 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఆర్‌బిఐ రిపోర్ట్ ప్రకారం..2021 మార్చి ముగింపు నాటికి డిజిటల్ చెల్లింపుల వాటా 14-19 శాతంగా ఉండగా.. 2024 మార్చి నాటికి 40-48 శాతానికి ఎగిశాయి. ఇదే సమయంలో నగదు వినియోగం భారీగానే నమోదయ్యిందని ఆర్‌బిఐ కరెన్సీ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన ప్రదీప్ భుయాన్ తెలిపారు.

2021 జనవరి-మార్చి కాలంలో ప్రయివేటు వినిమయంలో నగదు వాటా 81-86 శాతంగా ఉందన్నారు. 2024 జనవరి- మార్చి కాలంలో 52-60 శాతంగా నమోదయ్యిందన్నారు. మోడీ సర్కార్ 2016లో పెద్ద నోట్ల పేరుతో రూ.500, రూ. 1000 నోట్ల రద్దు చేసిన సమయంలో యునైటెడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) చెల్లింపుల విధానం ప్రారంభమైన సంగతి తెలిసిందే.

శ్రీవాణి బ్రేక్ దర్శన టికెట్ల జనవరి నెల కోటా విడుదల

ప్రజాశక్తి- తిరుమల

శ్రీవాణి బ్రేక్ దర్శన టికెట్లు 2025 జనవరి నెల కోటాను బుధవారం ఉదయం 11 గంటలకు టిటిడి విడుదల చేసింది. రోజుకు 500 టికెట్లు, 100 గదుల చొప్పున యాత్రికులకు అందుబాటులో ఉంచింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని 2025 జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు టికెట్ల విడుదల వాయిదా వేసినట్లు తెలిపింది. యాత్రికులు గమనించి తదనుగుణంగా టికెట్లను బుక్ చేసుకోవాల్సిందిగా కోరుతున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో టిటిడి పేర్కొంది.

అందరికీ నాణ్యమైన విద్యతోనే దేశాభివృద్ధి

- పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి- కాకినాడ

అందరికీ నాణ్యమైన విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. 'విద్యారంగం - సవాళ్లు' అనే అంశంపై కాకినాడ యుటిఎఫ్ హోమ్‌లో రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో బాలసుబ్రహ్మణ్యం ముఖ్యవక్తగా మాట్లాడుతూ ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో ఉత్పత్తిలో భాగస్వాములయ్యే వారికి తప్పనిసరిగా విద్యను అందించారని గుర్తు చేశారు. మనదేశంలో మాత్రం చదువు కొందరికే పరిమితం చేశారని తెలిపారు. ప్రపంచంలో విద్యాభివృద్ధికి సంబంధించిన నివేదికల రూపకల్పనలో భారత్ భాగస్వామ్యం లేదన్నారు. స్వాతంత్ర్యానికి ముందు.. తరువాత కూడా అందరికీ చదువు అనే నినాదం వచ్చిందన్నారు. కేరళ, హిమాచల్‌ప్రదేశ్, తాజాగా ఢిల్లీలో ప్రభుత్వ విద్యారంగం బలంగా ఉందని తెలిపారు. కేరళ తరహాలో ఎలిమెంటరీ పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని సూచించారు. మ్యాథమెటిక్స్‌లో ప్రయివేటు స్కూల్లో చదివే పిల్లల కంటే ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలే మెరుగ్గా ఉన్నారన్నారు. కొన్ని సర్వేల ప్రకారం ప్రయివేటు పాఠశాలల విద్యార్థుల కంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గణితంలో మెరుగ్గా ఉన్నట్లు తేలిందన్నారు. ఏ దేశ అభివృద్ధి అయినా ఆ దేశ విద్యాభివృద్ధితో ముడిపడి ఉంటుందని తెలిపారు. అమెరికా వంటి దేశాల్లోనూ కామన్ స్కూల్, నైబర్ హుడ్ స్కూల్ అనే విధానం అమలులో ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం సామాన్యులకు చదువును మరింత దూరం చేసే విధంగా ఉందన్నారు. మన దేశంలో, ముఖ్యంగా మన రాష్ట్రంలో బిడ్డల చదువు కోసం తల్లిదండ్రులు చాలా ప్రయాస పడుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులకు భారం కాకుండా, నాణ్యమైన విద్య అందరికీ అందాలనే డిమాండ్ పౌర సమాజం నుండి రావాలని కోరారు. తద్వారా పాలకుల విధానాలు మారతాయని తెలిపారు. ఈ సదస్సుకు పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు అధ్యక్షత వహించగా, యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ, జెవివి కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీరామారావు, స్టడీ సర్కిల్ వ్యవస్థాపక కన్వీనర్ సిహెచ్‌వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

చివరి అరగంటలో అమ్మకాలు లేచి.. పడిన మార్కెట్లు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో సానుకూల సంకేతాలు కానరావడం లేదు. బుధవారం ఆశాజనకంగానే ప్రారంభమైన సూచీలు.. చివరి అరగంటలో అమ్మకాల ఒత్తిడితో తుదకు నష్టాలను చవి చూశాయి. బిఎస్ఇ సెన్సెక్స్ ఉదయం 79,921 పాయింట్ల వద్ద ప్రారంభం కాగా.. ఇంట్రాడేలో 80,646 గరిష్టానికి చేరగా.. మరో దశలో 79,892కనిష్ఠానికి పడిపోయింది. తుదకు 138.74 పాయింట్ల నష్టంతో 80,082 వద్ద ముగిసింది. అదే బాటలో నిఫ్టీ 37 పాయింట్ల నష్టంతో 24,435 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, సన్‌ఫార్మా, ఎల్‌అండ్‌టి, అదానీ పోర్ట్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు అధిక నష్టాలను చవి చూడగా.. బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, టిసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభాల్లో ముగిశాయి.



బిగ్ సిలో దీపావళి డబుల్ ధమాకా ఆఫర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ సి కొనుగోలుదారులను ఆకర్షించడానికి దీపావళి పండుగ సందర్భంగా డబుల్ ధమాకా ఆఫర్లను ప్రకటించింది. ఈ సీజన్‌లో నాలుగు ఆకర్షణీయమైన ఆఫర్లను అందిస్తున్నామని బిగ్ సి సిఎండి యం బాలు చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీ మొబైల్ కొనుగోలుపై రూ.10,000 వరకు విలువ చేసే మొబైల్ ప్రొటెక్షన్ ఉచితంగా పొందవచ్చన్నారు. రూ12వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్, అదే విధంగా రూ.5,999 విలువ గల ఖచ్చితమైన బహుమతిని కూడా అందిస్తున్నామన్నారు. ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా మొబైల్ కొనుగోలు చేసే సౌలభ్యం కల్పిస్తున్నామన్నారు. వివో, ఒప్పో, ఎంఐ, రియల్‌మీ మొబైల్ కొనుగోళ్లపై లక్కీ డ్రాలో కార్లు, బైకులు, మొబైల్స్ తదితర బహుమతులను గెలుచు కోవచ్చన్నారు. బ్రాండెడ్ పరికరాలపై 51 శాతం వరకు డిస్కౌంట్ అందిస్తున్నామన్నారు. ఎటిఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టివి, ల్యాప్‌టాప్, ఎయిర్ కండీషనర్‌లను కొనుగోలు చేయవచ్చన్నారు.

విస్తరణపై ఎడెల్విన్ లైఫ్ దృష్టి

న్యూఢిల్లీ : తన పంపిణీ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడం ద్వారా మరింత విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎడెల్విస్ లైఫ్ ఇన్సూరెన్స్ తెలిపింది. దేశవ్యాప్తంగా ఖాతాదారులను పెంచుకోవడం కోసం వ్యూహాత్మక భాగస్వాములను ఎంచుకుంటున్నట్లు ఆ సంస్థ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అనూప్ సేథ్ అన్నారు. ఈ క్రమంలోనే ఇటీవల క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఇఎస్ఎఎఫ్ బ్యాంక్‌లతో భాగస్వామ్యం కుదర్చుకున్నామన్నారు.

జొమాటో డెలివరీ ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు

బెంగళూరు : ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో తన వినియోగదారులపై మరోమారు భారం పెంచాలని నిర్ణయించింది. బుధవారం నుంచి ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ ఫీజును రూ.10కి పెంచింది. ఇంతక్రితం ప్రతి ఆర్డర్‌పై రూ.7 వసూలు చేస్తుంది. దీనికి అదనంగా మరో రూ.3 పెంచినట్లు వెల్లడించింది. దేశంలో కొనసాగుతున్న పండుగ సీజన్ సందర్భంగా వినియోగదారులకు తమ సర్వీసుల్ని విజయవంతంగా అందించేందుకు వీలుగా ఈ ఫీజును పెంచాల్సి వచ్చిందని పేర్కొంది. తొలిసారి ప్లాట్‌ఫామ్ ఫీజును 2023లో ప్రవేశపెట్టింది. అప్పుడు రూ.2గా ఉండగా.. దీన్ని క్రమంగా పెంచుతూ వచ్చింది. ఈ సంస్థ రోజుకు సగటున 20-25 లక్షల ఫుడ్ ఆర్డర్లను డెలివరీ చేస్తోందని అంచనా.

బీమా రంగంలోకి జియో ఫైనాన్సియల్..!

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో ఫైనాన్షియల్ సర్వీసు బీమా రంగంలో జాయింట్ వెంచర్ (జెబి) ఏర్పాటు చేసే యోచనలో ఉంది. ఇప్పటికే ఈ అంశంపై అలియాంజ్ ఎస్ఇతో జట్టు కట్టేందుకు చర్చలు జరుపుతోందని సమాచారం. జర్మనీకి చెందిన అలియాంజ్ భారత్‌లో ఇప్పటికే ఉన్న రెండు సంయుక్త భాగస్వామ్య సంస్థలను రద్దు చేసుకోవాలని భావిస్తోంది. ఈక్రమంలో అలియాంజ్, జియో కలిసి జనరల్ ఇన్స్యూరెన్స్, లైఫ్ ఇన్స్యూరెన్స్ సేవల సంస్థను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నాయని రిపోర్టులు వస్తోన్నాయి.

టాటా మోటార్స్ 'కస్టమర్ కేర్ మహోత్సవ్'

ముంబయి : దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తన వాణిజ్య వాహన వినియోగదారులకు సమగ్ర సేవలందించడానికి 'కస్టమర్ కేర్ మహోత్సవ్ 2024'ను ప్రారంభించినట్లు తెలిపింది. వాహనాల శ్రేణికి సంబంధించి తనిఖీలు, విలువ ఆధారిత సేవలు, డ్రైవర్ శిక్షణతో సహా మెరుగైన విక్రయానంతర అనుభవాన్ని అందించడం లక్ష్యంగా ఈ ప్రోగ్రామ్ ఉంటుందని పేర్కొంది. దీన్ని 2500 పైగా డీలర్‌షిప్‌ల్లో 2024 డిసెంబర్ 24 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొంది.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు, లోయలో పడిన ఆర్‌టిసి బస్సు (ఇన్‌సెట్‌లో)

లోయలో పడిన ఆర్‌టిసి బస్సు

- 25 మందికి గాయాలు

ప్రజాశక్తి-పులివెందుల రూరల్ (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ జిల్లా పులివెందుల సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ఆర్‌టిసి పల్లె వెలుగు బస్సు 30 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 25 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పులివెందుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కదిరి నుంచి బయల్దేరిన బస్సు పులివెందుల సమీపంలోని డంపింగ్ యార్డు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో డ్రైవర్ బ్రేకులు వేశారు. బస్సు జారిపోయి పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆర్‌టిసి డిఎస్‌పి మురళి నాయక్, సిఐ జీవన్ గంగానాథ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో క్షతగాత్రులను వెంటనే 108 వాహనం ద్వారా పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు కండక్టర్ నీరుదామణి నడుముకు గాయం కావడంతో ఆమెకు చికిత్స చేశారు. కదిరికి చెందిన షేక్ షావూర్ జాకు చెయ్యి, ముదిగుబ్బ మండలానికి చెందిన వెంకట శివమ్మకు భుజం విరిగాయి. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్ కిషోర్, పులివెందుల ఆర్‌డిఒ అన్నపూర్ణ ప్రత్యూష భానుశ్రీ, తహశీల్దార్ నజీర్ అహ్మద్, ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ ప్రవీణ్ పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ గంగిరెడ్డి పోలీసు స్టేషన్‌లో లొంగిపోయారు.

చిలమత్తూరు ఘటనలో మరొకరు అరెస్టు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్ (శ్రీ సత్యసాయి జిల్లా)

శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో అత్తాకోడళ్లపై అత్యాచార ఘటనలో పరారీలో ఉన్న మరో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ ఘటనలో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడిని మంగళవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి వి.రత్న బుధవారం విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చిలమత్తూరు సమీపంలోని పేపర్ మిల్లులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న ఓ కుటుంబంలోని ఇద్దరు అత్తాకోడళ్లపై ఈ నెల 12న ఆరుగురు అత్యాచారం చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ నెల 14న ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ ఘటనలో 2వ ప్రధాన నిందితుడు చాకలి శ్రీనివాసులు పరారీలో ఉన్నారు. పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు హిందూపురం సమీపంలోని పూలకుంటలో ఆయనను అరెస్టు చేశారు. హిందూపురం, చిలమత్తూరు ప్రాంతాల్లో ఈ ముఠా పలు నేరాలకు పాల్పడినట్లు తమ విచారణలో తేలిందని, బాధితులు ఎవరైనా ఉంటే ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వెలువడినది
వ్యవసాయ కార్మిక రంగంలో కృషి - సమీక్ష
(2024 జనవరి 28- 30 తేదీల్లో తిరువనంతపురం, కేరళలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించినది)
వెల : 20/-
ప్రజాశక్తి బుక్‌హౌస్
దోరు నెం.27-1-54, కారల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ - 2
ఫోన్ : 9490099018, 9490099057

వెలువడినది
జాతీయ అంతర్జాతీయ పరిణామాలపై నివేదిక
(2024 సెప్టెంబర్ 29,30 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించినది)
వెల : 15/-
ప్రజాశక్తి బుక్‌హౌస్
దోరు నెం.27-1-54, కారల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ - 2
ఫోన్ : 0866-2577202, 9490099057

ఐబిసి, 2016 క్రింద అమ్మకపు ప్రకటన

సాయిభాస్కర్ ఐరన్స్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో)
CIN-